ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 20 సంచిక : 306 శుక్రవారం 03, జూలై 2026 పేజీలు: 4 వెల: రూ.1

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR CELL : 8008609999



# పోలీస్ శాఖలో ఏసీబీ భారీ స్కెచ్

డీఎస్పీ భీమ్ రెడ్డి
ఇళ్లపై ఏకకాలంలో దాడులు
వెండి బిందెలు, విదేశీ మద్యం లభ్యం
ఆదాయానికి మించిన ఆస్తుల గుట్టురట్టు
విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి..
తారామతి బారామతి
లగ్జరీ విల్లాలో సోదాలు
బంధువులు, సన్నిహితుల
ఇళ్లలోనూ తనిఖీల పర్వం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

హైదరాబాద్ మహానగరంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి తమ బలగాలతో విరుచుకుపడ్డారు. ఈసారి ప్రభుత్వ సామాన్య ఉద్యోగులు కాకుండా ఏకంగా పోలీస్ శాఖలోని ఒక ఉన్నతాధికారే లక్ష్యంగా ఈ దాడులు జరగడం సంచలనం సృష్టిస్తోంది. తెలంగాణ డీజీపీ కార్యాలయంలోని కంప్యూటర్స్ విభాగంలో అత్యంత కీలకమైన బాధ్యతల్లో ఉన్న డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసాలపై అధికారులు గురువారం ఉదయాన్నే దాడులు ప్రారంభించారు. ఏసీబీ అధికారుల అకస్మాత్తు ఎంట్రీతో సదరు అధికారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. డీఎస్పీ భీమ్ రెడ్డి తన అధికారిక ఆదాయానికి మించి విపరీతమైన ఆస్తులను మిగతా 3లో..

# మంత్రులు భయపడి పారిపోయారు

మాజీ మంత్రి
హరీశ్ రావు విమర్శలు
గురుకుల టెండర్లు,
అప్పులపై ఆరోపణలు
హరీశ్‌రావు సహ బీఆర్ఎస్
నేతల అరెస్ట్.. విడుదల
బహిరంగ చర్చల సవాళ్లతో
రోడ్డెక్కిన ప్రధాన పార్టీలు
సోమాజిగూడ ప్రెస్‌క్లబ్
వేదికగా ఆర్ఎస్పీ సవాల్
ఫోన్లు చేసినా ఎత్తని
అధికార పక్ష నేతలు
ఖాకీల బలప్రయోగం మధ్య
బీఆర్ఎస్ నేతల అరెస్టులు

హైదరాబాద్, (ప్రజాస్వరం):



తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీల మధ్య సాగుతున్న రాజకీయ పోరు సరికొత్త రణరంగానికి దారితీసింది. గురుకుల పాఠశాలల టెండర్లలో భారీగా అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు, అలాగే రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై ఇరు పార్టీల మధ్య నడిచిన సవాళ్లు, ప్రతి సవాళ్లు గురువారం నాడు వీధి పోరాటాలుగా మారాయి. పల్లెలు, పట్టణాల అభివృద్ధిని పక్కనబెట్టి నేతలు బహిరంగ చర్చల కోసం రోడ్లపైకి రావడంతో హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురుకులాల టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఆరోపణలను నిరూపిస్తే తాను తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. ఈ క్రమంలోనే మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌లు గురువారం ఉదయాన్నే అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. తాము అవినీతికి పాల్పడినట్లు బీఆర్ఎస్ నేతలు నిరూపిస్తే, ముగ్గురం మంత్రులం ఇదే గన్‌పార్క్ సాక్షిగా ముక్కు నేలకు రాస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన ప్రకటన చేశారు. ఇదిలావుండగా, బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ మంత్రుల సవాల్‌పై ప్రతి సవాల్ విసిరారు. తాము సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ మంత్రులు అక్కడికి రావాలని కోరారు. అయితే దీనిపై మంత్రులు భిన్నంగా స్పందించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్థాయికి తాము రానవసరం లేదని, ఆయన చర్చకు వస్తే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు మాత్రమే ప్రెస్‌క్లబ్‌కు వస్తారని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు లాంటి మాజీ మంత్రులు లేదా ఎమ్మెల్యేలు మిగతా 2లో..

# వీబీ జీరామ్‌జీ అమలుకు క్యాబినెట్ ఆమోదం

అభ్యంతరాలపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్న రాష్ట్ర ప్రభుత్వం
మూసీ తొలి దశ పనులకు రూ.7,345 కోట్ల మంజూరు
టిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులు
ఉపాధ్యాయులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం
1.50 లక్షల మంది సిబ్బందికి పథకం వర్తింపు
గోదాములు, విద్యాసంస్థలకు భూముల కేటాయింపు
మూసీ ప్రాజెక్టుకు కొత్త పోస్టుల సృష్టికి ఆమోదం
పలు అభివృద్ధి, సంక్షేమ నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్
సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టం అమలు, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, టిమ్స్ ఆస్పత్రుల్లో భారీ ఉద్యోగాల భర్తీ, ఉపాధ్యాయులకు భోజన పథకం విస్తరణ, గిడ్డంగులు, విద్యా సంస్థలకు భూముల కేటాయింపు వంటి కీలక అంశాలపై క్యాబినెట్ నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టంలోని కొన్ని నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రాలను సంప్రదించకుండా చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడింది. అయితే ఉపాధి హామీ కూలీలకు పనులు నిలిచిపోకుండా ఉండే ఉద్దేశంతో రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. అదే సమయంలో చట్టంలోని అభ్యంతరకర నిబంధనలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు తొలి దశ పనులకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనుండగా, ప్రాజెక్టు నిర్వహణ కోసం కొత్తగా పోస్టుల మిగతా 2లో..



# గన్‌పార్క్ వద్ద హైడ్రామా

గురుకుల టెండర్ల సవాల్‌తో దద్దరిల్లిన హైదరాబాద్
హరీశ్‌రావు అరెస్టుతో తారస్థాయికి చేరిన రాజకీయ రచ్చ
సవాళ్లు, ప్రతి సవాళ్లతో హీటెక్కిన భాగ్యనగరం
గన్‌పార్క్ సాక్షిగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ముఖాముఖి పోరు
అమరవీరుల స్తూపం వద్ద కాంగ్రెస్ మంత్రుల మోహరింపు
గులాబీ నేతలు ఎవరు వచ్చినా చర్చకు సిద్ధం
బీఆర్ఎస్ నేతలవి పచ్చి అబద్ధాలన్న మంత్రి పొన్నం
గురుకుల టెండర్ల ప్రక్రియ అంతా పారదర్శకమేనని వెల్లడి



హైదరాబాద్, (ప్రజాస్వ-

తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా ఊహించని మలుపు తిరిగాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న మాటల యుద్ధం కాస్తా వీధి పోరాటంగా మారింది. గురుకుల పాఠశాలల టెండర్ల కొనుగోలు వ్యవహారంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ చేసిన మిగతా 2లో..

# భారత్-జపాన్ బంధంలో చారిత్రాత్మక మైలురాయి

రక్షణ రంగంలో తొలిసారి ఉమ్మడి ప్రాజెక్ట్
సరికొత్త శిఖరాలకు ద్వైపాక్షిక వ్యూహాత్మక మైత్రి
పరస్పర నమ్మకమే మన అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి
భారత్-జపాన్ 16వ వార్షిక సదస్సులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
జపాన్ తొలి మహిళా ప్రధాని తకాయిచి నా చెల్లెలు
నారా ప్రాంత ఉమ్మడి బౌద్ధ వారసత్వాన్ని గుర్తుచేసిన మోదీ
ఏఐ, సరికొత్త సాంకేతికత కోసం ఉమ్మడి విజన్ ఆవిష్కరణ
భారత్‌కు భారీగా జపాన్ పెట్టుబడులు
120 నూతన వ్యాపార ఒప్పందాలతో 10 బిలియన్ డాలర్ల రాక
రానున్న దశాబ్ద కాలంలో జపాన్ కంపెనీల సంఖ్య రెట్టింపు
10 ట్రిలియన్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందడుగు
ఫార్మా, వైద్య రంగాల్లో చేతులు కలిపిన ఇరు దేశాలు

హైదరాబాద్, (ప్రజాస్వరం):

భారతదేశం, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ స్నేహ బంధం సరికొత్త స్థాయికి చేరుకుంది. దిల్లీ వేదికగా నిర్వహించిన భారత్‌జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో రెండు దేశాల అగ్రనేతలు పాల్గొని ద్వైపాక్షిక సంబంధాలపై కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉన్న 'పరస్పర విశ్వాసమే' మిగతా 2లో..



# నా అంకెలు తప్పయితే రాజీనామా చేస్తా

తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి సవాల్
కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
రికార్డులతో సహా తెలంగాణ
భవన్‌కు వచ్చేందుకు సిద్ధం
బీఆర్ఎస్ నేతల
బుకాయింపులపై మంత్రి ఆగ్రహం
బీఆర్ఎస్ అప్పుల వల్ల
నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ
ఈ పాపానికి కేసీఆర్
ఎందుకు స్పందించడం లేదు?
గులాబీ నేతలకు మంత్రి సూటి ప్రశ్న
కాళేశ్వరం పేరిట జరిగిన దోపిడీపై ధ్వజం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అప్పుల వ్యవహారంపై రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన సవాల్ విసిరారు. బుధవారం తాను శాసనసభ, మీడియా వేదికగా వెల్లడించిన రాష్ట్ర అప్పుల అంకెలు, వివరాలలో ఏ ఒక్కటి తప్పని నిరూపించినా తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు. గత ప్రభుత్వం చేసిన అడ్డగోలు అప్పుల వల్లే నేడు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో మిగతా 2లో..



# పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు

క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు
త్వరలో టెండర్లకు ప్లాన్ చేస్తున్న ప్రభుత్వం
ఇందిరమ్మ ఇళ్ల టెండర్లకు సర్వం సిద్ధం
స్థల సేకరణ తుది దశకు చేరిందన్న పొంగులేటి
గోషామహల్‌లో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ
ఒకే వేదికపై చేతులు కలిపిన అధికార, ప్రతిపక్ష నేతలు
క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్
తొలి విడతగా నియోజకవర్గానికి వెయ్యి ఇళ్ల నిర్మాణం
ఎకరా స్థలం రూ.200 కోట్లు ఉన్నా పేదలకే సొంతం
విలువను పక్కనబెట్టి గూడు కల్పిస్తామన్న ప్రభుత్వం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ముందుకు సాగుతోంది. క్యూర్ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి త్వరలోనే భారీ ఎత్తున టెండర్లు పిలవనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ ఇళ్ల నిర్మాణానికి అత్యంత కీలకమైన స్థల సేకరణ ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని ఆయన మిగతా 2లో..



www.prajaswaramdaily.com
WWW.PRAJASWARAMDAILY.COM

# నా అంకెలు తప్పయితే రాజీనామా చేస్తా

**మొదటిపేజీ తరువాయి**



కూరుకుపోయిందని, ఈ విషయంలో తాను వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

రాష్ట్ర అప్పులపై చర్చకు రావాలంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావులకు మంత్రి జూపల్లి కృష్ణారావు బహిరంగ పిలుపునిచ్చారు. తన వద్ద అప్పులకు సంబంధించిన పూర్తి స్థాయి అధికారిక రికార్డులు, పత్రాలు ఉన్నాయని ఆయన తెలిపారు. "అప్పులపై చర్చకు నేను నేరుగా మీ పార్టీ ఆఫీస్ అయిన తెలంగాణ భవన్‌కే వస్తాను. దీనికోసం మా అగ్రనేత రాహుల్ గాంధీ లేదా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానవసరం లేదు, నేనొక్కడినే వచ్చి మీ తప్పులను ఆధారాలతో సహా నిరూపిస్తా" అని సవాల్ చేశారు. నిజాలు కళ్లెదుటే కనిపిస్తున్నా మాజీ మంత్రులు ఇంకా బుకాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల నేడు తెలంగాణ రాష్ట్రం ప్రతి నెలా దాదాపు రూ.6,000 కోట్ల రూపాయలను కేవలం వడ్డీల రూపంలోనే చెల్లించాల్సి వస్తోందని మంత్రి జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టార్జితం అంతా వడ్డీలకే పోతోందని, ఇంతటి దారుణమైన పరిస్థితికి కారణమైన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు ఇంతటి ద్రోహం చేసిన కేసీఆర్, తక్షణమే ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి ఈ వడ్డీల భారంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. తాము పదేళ్ల పాటు తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చామని, అద్భుతమైన ప్రగతి సాధించామని బీఆర్ఎస్ నేతలు చెప్పుకోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. "మీరు అంత గొప్పగా, అవినీతి రహితంగా పరిపాలన అందించి ఉంటే.. మొన్నటి ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మీ ప్రభుత్వాన్ని ఎందుకు తిరస్కరించారు? మిమ్మల్ని గద్దె దించి కాంగ్రెస్‌కు ఎందుకు అధికారం ఇచ్చారో గులాబీ నేతలు గుండెలపై చేయి వేసుకుని ఆలోచించుకోవాలి" అని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ హయాంలో కేవలం రూ.3.50 లక్షల కోట్లు మాత్రమే అప్పులు చేశామని కేటీఆర్ చెప్తున్న మాటలు పచ్చి అబద్ధాలని మంత్రి జూపల్లి కొట్టిపారేశారు. వాస్తవానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.7.3 లక్షల కోట్ల నుండి రూ.8 లక్షల కోట్ల వరకు ఉందని ఆయన అంకెలతో సహా వివరించారు. కేవలం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు పేరు చెప్పి ఏకంగా రూ.74 వేల కోట్ల అప్పులు తెచ్చారని, ఆ ప్రాజెక్టు వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా, తెచ్చిన నిధులన్నీ ఎటు పోయాయో సమాధానం లేదని తీవ్ర ధ్వజమెత్తారు.

బడ్జెట్ అప్పులు కాకుండా, ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను దాటడం కోసం గత ప్రభుత్వం వివిధ రకాల ప్రభుత్వ కార్పొరేషన్లు, సంస్థలను విచ్చలవిడిగా ఏర్పాటు చేసిందని జూపల్లి ఆరోపించారు. ఆయా సంస్థల గ్యారెంటీల పేరుతో బ్యాంకుల నుండి లక్షల కోట్ల రూపాయల అప్పులను దొడ్డిదారిన తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈ అప్పుల వివరాలన్నింటినీ దాచిపెట్టి, తాము తక్కువ అప్పులే చేశామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. బీఆర్ఎస్ నేతలు కల్లబొల్లి మాటలతో ప్రజలను ఎల్లకాలం భ్రమల్లో ఉంచలేరని, వాస్తవాలు త్వరలోనే పూర్తి స్థాయిలో బయటకు వస్తాయన్నారు.

ప్రాజెక్టులు కట్టడానికి కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన లక్షల కోట్ల అప్పులను భవిష్యత్తులో ఎలా తీరుస్తారని మంత్రి జూపల్లి బీఆర్ఎస్ నేతలను నిలదీశారు. "కాళేశ్వరం కోసం తెచ్చిన అప్పుల అసలు, వడ్డీలను రేపు పొద్దున రైతుల నుంచి వసూలు చేస్తారా? ప్రాజెక్టు నీళ్లు వాడుకుంటున్నందుకు ఒక్కో రైతు నెత్తిన రూ.20 లక్షల చొప్పున భారం వేసి వసూలు చేస్తారా?" అని అడిగారు. ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా, కేవలం కమీషన్ల కోసమే అడ్డగోలుగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాము అధికారంలోకి వచ్చిన నాటి నుండి గత ప్రభుత్వ అక్రమాలను ఒక్కొక్కటిగా బయటకు తీస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేసింది. తాము చెప్తున్న ఆర్థిక అంకెల్లో ఎలాంటి తప్పులు లేవని, శ్వేతపత్రంలో పెట్టిన వివరాలకే తాము ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని జూపల్లి పునరుద్ఘాటించారు. కేసీఆర్ స్వయంగా మీడియా ముందుకు వచ్చి తాము అప్పులు చేయలేదని చెప్తే, అప్పుడు తాము తదుపరి చర్యలకు సిద్ధమన్నారు. అబద్ధాలతో పబ్బం గడుపుకునే సంస్కృతి బీఆర్ఎస్‌దే కానీ కాంగ్రెస్ ది కాదని గాంధీభవన్ వేదికగా మంత్రి జూపల్లి కృష్ణారావు తేల్చిచెప్పారు.

# మంత్రులు భయపడి పారిపోయారు

**మొదటిపేజీ తరువాయి**




వస్తేనే తాము నేరుగా చర్చిస్తామని తేల్చిచెప్పారు.

మంత్రుల సవాల్‌ను స్వీకరించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం ఉదయం బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో కలిసి చర్చల కోసం గన్‌పార్క్ వైపు బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. అయితే, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూసేందుకు పోలీసులు తెలంగాణ భవన్ పరిసరాల్లో భారీగా మోహరించారు. హరీశ్‌రావు కాన్వాయ్‌ను గేటు దాటకుండానే బారికేడ్లు పెట్టి పోలీసులు తీవ్రంగా అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.

పోలీసులు తమను అడ్డుకోవడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ మంత్రులే స్వయంగా ఆధారాలతో గన్‌పార్క్‌కు రమ్మని సవాళ్లు విసిరారు. వారి మాట నమ్మి మేము అన్ని రికార్డులతో బయలుదేరాం. మమ్మల్ని రమ్మని పిలిచి, ఇప్పుడు పోలీసుల వెనుక దాక్కోవడం ఏంటి?" అని నిలదీశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాన్ని ఆపాలని చూస్తున్నారంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం చర్చకు భయపడి పారిపోతోందని అర్థమవుతోందని హరీశ్‌రావు ఘాటు విమర్శలు చేశారు.

తాము గన్‌పార్క్‌కు వెళ్లకుండా ఆపవద్దని హరీశ్‌రావు పోలీసులను కోరారు. తాము వస్తున్న విషయాన్ని అక్కడున్న మంత్రులకు చెప్పాలని, కావాలంటే తానే ఫోన్ చేస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే ముగ్గురు కాంగ్రెస్ మంత్రులకు హరీశ్‌రావు ఫోన్ చేసినా వారు స్పందించలేదని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గురుకులాల టెండర్ల రచ్చ ఇలా ఉంటే.. రాష్ట్ర అప్పుల వ్యవహారంపై కూడా మరో రణరంగం నడిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా అప్పులు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించగా, దానికి మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు. అప్పులపై చర్చకు తాను సిద్ధమని జూపల్లి సవాల్ విసరడంతో, కేటీఆర్ గురువారం ఉదయమే తెలంగాణ భవన్‌కు చేరుకుని నిరీక్షించారు. తాము ఆర్థిక లెక్కలతో సిద్ధంగా ఉన్నామని, జూపల్లి ఎప్పుడు వస్తారో తేల్చుకుందామని కేటీఆర్ ప్రకటించారు.ట్విస్ట్ ఏంటంటే.. తెలంగాణ భవన్‌కు వెళ్లాల్సిన ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ఉదయం హఠాత్తుగా గన్‌పార్క్ వద్ద ప్రత్యక్షమయ్యారు. తాను గాంధీభవన్‌కు వెళ్తున్న సమయంలో గన్‌పార్క్‌కు హరీశ్ రావు వస్తున్నారనే సమాచారం తెలిసి ఇక్కడికి వచ్చానని జూపల్లి వెల్లడించారు. "నేను నా సవాల్‌కు కట్టుబడే వచ్చాను. కానీ ఇక్కడికి బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ఎవరూ రాలేదు. అప్పుల వివరాలపై చర్చించేందుకు బీఆర్ఎస్ నుంచి ఏ నాయకుడు వచ్చినా సరే.. నేను ఇక్కడే కూర్చుని లెక్కలు తేల్చడానికి సిద్ధం" అని జూపల్లి స్పష్టం చేశారు. ఈ సవాళ్లు, అరెస్టుల పర్వంతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా కుదిపేశాయి.

# భారత్‌జపాన్ బంధంలో చారిత్రాత్మక మైలురాయి

**మొదటిపేజీ తరువాయి**

అన్నిటికంటే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి అని అభివర్ణించారు. ప్రపంచ సంక్షోభ సమయాల్లో ఇరు దేశాల నమ్మకం మరింత బలపడిందని ఆయన స్పష్టం చేశారు.

వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం భారత్‌కు విచ్చేసిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచికి ప్రధాని మోదీ ఘనస్వాగతం పలికారు. ఆమెను తన 'చెల్లెలు' అని ఆత్మీయంగా సంబోధిస్తూ ప్రత్యేక గౌరవాన్ని చాటారు. జపాన్ దేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా ఎన్నికైన సనాయె తకాయిచి ఎంతో దూరదృష్టి కలిగిన, ప్రజాదరణ పొందిన లీడర్ అని ప్రధాని కొనియాడారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న జపాన్‌లోని నారా ప్రాంతం, భారతదేశంతో ముడిపడి ఉన్న ఉమ్మడి బౌద్ధ సాంస్కృతిక వారసత్వానికి ఒక చారిత్రాత్మక కేంద్రంగా నిలిచిందని మోదీ గుర్తుచేశారు.

ఈ చారిత్రాత్మక సదస్సులో రక్షణ రంగానికి సంబంధించి ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. భారత్, జపాన్ దేశాలు తమ రక్షణ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఒక ఉమ్మడి ప్రాజెక్టును చేపట్టేందుకు చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. దీనితో పాటు భవిష్యత్ అంతర్జాతీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో సరికొత్త భాగస్వామ్యం కోసం ఇరు దేశాల ప్రతినిధులు ఒకే ఉమ్మడి విజన్ పత్రాన్ని ఆవిష్కరించారు. ఇది ప్రపంచ వ్యూహాత్మక రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

గడచిన కొద్ది కాలంలో భారత్‌జపాన్ దేశాల మధ్య ఆర్థిక, పెట్టుబడి భాగస్వామ్యం ఊహించని రీతిలో వేగవంతంగా పుంజుకుందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గడిచిన ఏడాది కాలంలోనే ఇరు దేశాల ప్రైవేటు, ప్రభుత్వ రంగాల మధ్య దాదాపు 120 సరికొత్త వ్యాపార ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. ఈ నూతన ఒప్పందాల ద్వారా దాదాపు 10 బిలియన్ డాలర్లకు పైగా జపాన్ దేశ పెట్టుబడులు భారతదేశానికి తరలిరానున్నాయని స్పష్టం చేశారు. ఇరు దేశాల ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏజెన్సీల మధ్య జరిగిన తాజా ఒప్పందం దేశంలోకి పెట్టుబడుల ప్రవాహాన్ని మరింత సులభతరం చేస్తుందని పేర్కొన్నారు.

భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి జపాన్ పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తిగా ఉన్నారని, అందుకు అనుగుణంగానే భారత ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక సంస్కరణలు చేపట్టిందని సీఎం తెలిపారు. తమ తదుపరి ప్రధాన టార్గెట్ జపాన్ నుంచి భారతదేశానికి ఏకంగా 10 ట్రిలియన్ల పెట్టుబడులను ఆకర్షించడమేనని మోదీ స్పష్టం చేశారు. అలాగే రానున్న పదేళ్ల కాలంలో దేశంలో ప్రస్తుతం పనిచేస్తున్న జపాన్ కంపెనీల సంఖ్యను రెట్టింపు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. దేశంలో నిరంతరాయంగా జరుగుతున్న సంస్కరణలు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపార సౌలభ్యం)ను భారీగా మెరుగుపరిచాయని, ఈ సువర్ణ అవకాశాన్ని జపాన్ కంపెనీలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం రక్షణ, పారిశ్రామిక రంగాలకే పరిమితం కాకుండా ప్రజా ఆరోగ్య రక్షణలో కూడా భారత్‌జపాన్ దేశాలు కీలక భాగస్వామ్యం వహించనున్నాయి. ఇందులో భాగంగా ఫార్మాస్యూటికల్స్ (ఔషధాల తయారీ), అత్యాధునిక వైద్య పరికరాల ఉత్పత్తి, బయోటెక్నాలజీ రంగాలలో ఇరు దేశాల నిపుణుల మధ్య పలు కీలక ఒప్పందాలు జరిగాయి. ఈ రంగాలలో జరిగే ఉమ్మడి పరిశోధనలు, పరస్పర సహకారం కేవలం ఇరు దేశాలకే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ ఆరోగ్య భద్రతను పటిష్టం చేయడానికి ఎంతగానో దోహదపడతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రస్తుత ఆధునిక డిజిటల్ యుగంలో ఆర్థిక భద్రత, ఇంధన స్వయంసమృద్ధి అత్యంత ముఖ్యమైనవని ఇరు దేశాలు బలంగా నమ్ముతున్నాయి. అందుకోసం ఒక పటిష్టమైన ఆర్థిక భద్రత ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. దీని ద్వారా అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న సెమీకండక్టర్ల తయారీ, క్వాంటం టెక్నాలజీ, అధునాతన మెటీరియల్స్ వంటి అత్యంత వ్యూహాత్మక రంగాల్లో గ్లోబల్ సరఫరా గొలుసు దెబ్బతినకుండా స్థిరంగా ఉండేలా ఇరు దేశాలు కలిసికట్టుగా అడుగులు వేయనున్నట్లు స్పష్టం చేశారు.



పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన భద్రత కోసం భారత్‌జపాన్ బయోగ్యాస్ చొరవకు ఇరు దేశాల నేతలు ఆమోదం తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కింద భారతదేశం అంతటా సుమారు 1000 సరికొత్త బయోగ్యాస్ మరియు సేంద్రియ ఎరువుల ప్లాంట్లను స్థాపించనున్నారు. జపాన్ సాంకేతికతతో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్లు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గోబర్‌ధన్' కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూరుస్తాయని ప్రధాని తెలిపారు. ఈ వినూత్న చర్య ద్వారా భారతీయ గ్రామాలలో పర్యావరణ సుస్థిరత పెరగడమే కాకుండా, గ్రామీణ ప్రజల ఆర్థిక శ్రేయస్సుకు, వారి జీవనోపాధికి సరికొత్త ఊపు లభిస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గన్‌పార్క్ వద్ద హైడ్రామా

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపణలు ఈ తీవ్ర ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. ఈ ఆరోపణలను రుజువు చేయాలంటూ ఇరుపక్షాలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకోవడంతో హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న గన్‌పార్క్ ప్రాంతం ఒక్కసారిగా పొలిటికల్ అఖాడాగా మారిపోయింది. రెండు పార్టీల ప్రధాన నేతలు ముఖాముఖి చర్చకు సిద్ధం కావడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది.

గురుకులాల్లో ఎలాంటి అవినీతి జరగలేదని, దమ్ముంటే తమతో చర్చకు రావాలంటూ కాంగ్రెస్ మంత్రులు ఇచ్చిన పిలుపుతో గన్‌పార్క్ వద్ద హడావుడి మొదలైంది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పెద్ద ఎత్తున తమ అనుచరులతో కలిసి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు గానీ, అగ్రనేతలు గానీ ఎవరు వచ్చినా సరే, తాము ఇక్కడే కూర్చుని లెక్కలతో సహా తేల్చడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రులు ప్రకటించారు.

గన్‌పార్క్ వద్ద వేచి చూస్తున్న సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. హాస్టళ్లలో, గురుకులాల్లో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న వ్యాఖ్యలన్నీ పచ్చి అబద్ధాలని ఆయన కొట్టిపారేశారు. ఈ కొనుగోలు ప్రక్రియ మొత్తం అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తరఫున ఏకపక్షంగా కాకుండా, ఏకంగా నాలుగు ప్రభుత్వ శాఖల సమక్షంలో, పూర్తి పారదర్శక నిబంధనలతో గ్లోబల్ టెండర్లు పిలిచినట్లు పొన్నం వెల్లడించారు.

ప్రభుత్వ టెండర్ల నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ఎవరైనా సరే ఆన్‌లైన్ ద్వారా టెండర్లలో పాల్గొనవచ్చనే కనీస జ్ఞానం కూడా ప్రతిపక్ష నేతలకు లేదా అని మంత్రి పొన్నం ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేద పిల్లలకు నాణ్యమైన వసతులు, విద్య అందుతుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఐపీఎస్ అధికారిగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా బుకాయింపులు ఆపాలని హితవు పలికారు.

మరోవైపు, రాష్ట్ర అప్పుల వివరాలపై తెలంగాణ భవన్‌కు వచ్చి చర్చిస్తానంటూ బుధవారం కాంగ్రెస్ మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ స్వీకరించింది. జూపల్లి వస్తారనే నమ్మకంతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తమ పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు ముందే చేరుకున్నారు. మంత్రి జూపల్లి కోసం తామంతా వేచి చూస్తున్నామని, అప్పుల లెక్కలపై తాము ఏ క్షణమైనా లైవ్ డిబేట్‌కు సిద్ధమని హరీశ్‌రావు ప్రకటించారు. అయితే జూపల్లి రాకపోవడంతో, గన్‌పార్క్ వద్ద ఉన్న పొన్నం ప్రభాకర్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు.

గురుకులాల టెండర్లపై మంత్రుల సవాల్‌ను స్వీకరిస్తూ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, వి. శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరికొందరు ముఖ్య నేతలతో కలిసి తెలంగాణ భవన్ నుండి కార్లలో గన్‌పార్క్ వైపు బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు హరీశ్‌రావు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌ను మార్గమధ్యంలోనే భారీ బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

తమ వాహనాలను అడ్డగించిన పోలీసులపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము శాంతియుతంగా చర్చలు జరపడానికి వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ మంత్రులే స్వయంగా సవాల్ విసిరి, తీరా చర్చకు వస్తుంటే పోలీసులను అడ్డుపెట్టుకుని దాగుడుమూతలు ఆడుతున్నారని ఆరోపించారు. ఖాకీలను పెట్టి ప్రతిపక్షాలను అరెస్ట్ చేయిస్తున్నారంటేనే, గురుకుల టెండర్లలో అవినీతి నిజమని తేలిపోయిందని, చర్చకు భయపడి కాంగ్రెస్ ప్రభుత్వమే పారిపోతోందని హరీశ్‌రావు ఘాటు విమర్శలు చేశారు.

పోలీసులు వాహనాలను వెళ్లనివ్వకపోవడంతో హరీశ్‌రావు తన కారు దిగి, నేతలతో కలిసి గన్‌పార్క్ వైపు కాలినడకన బయలుదేరారు. అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి అక్కడే నిలదీస్తామని ముందుకు సాగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. పరిస్థితి చేదాటిపోతోందని గ్రహించిన పోలీసులు హరీశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ వాహనాల్లోకి ఎక్కించి అరెస్టు చేశారు. ఈ అరెస్టులతో తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా ప్రకంపనలు సృష్టించాయి.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు. దశలవారీగా రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేద కుటుంబానికి పక్కా గృహాన్ని అందించి తీరుతామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

హైదరాబాద్ నగరం గోషామహల్ నియోజకవర్గ పరిధిలో అన్ని హంగులతో పూర్తి చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన అధికారిక పట్టాలను గురువారం నాడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో పాటు కాంగ్రెస్ అగ్రనేత మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, హైదరాబాద్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఈ వేదికను పంచుకుని మంత్రులతో కలిసి పేదలకు ఇళ్ల తాళాలు, పట్టాలను అందజేశారు. సొంత ఇళ్లు దక్కడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి.

ఇళ్ల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భవిష్యత్ కార్యాచరణను వివరించారు. క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో దాదాపు ఒక లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రత్యేక ఆదేశాల మేరకు.. మూడు వేర్వేరు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్లకు అవసరమైన భూమిని సేకరిస్తున్నామని, మరో రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. ప్రాథమికంగా క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో నియోజకవర్గంలో 500 నుండి 1,000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని, ఆ తర్వాత రెండు, మూడు విడతల్లో మిగిలిన ఇళ్లను పూర్తి చేస్తామన్నారు.గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోని పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించబోతోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే పల్లెల్లో ఒక్కో నియోజకవర్గానికి సుమారు 5,500 ఇళ్లను మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. అదే సమయంలో హైదరాబాద్ వంటి మహానగరాల్లో భూమి విలువ ఆకాశాన్నంటుతోందని గుర్తుచేశారు. నగరంలో ఎకరా భూమి ధర రూ.100 కోట్ల నుండి రూ.200 కోట్ల వరకు పలుకుతున్నప్పటికీ.. ప్రభుత్వం ఆ వాణిజ్య విలువను అస్సలు పరిగణనలోకి తీసుకోదని స్పష్టం చేశారు. ఎంత ఖరీదైన భూమి అయినా సరే, దానిని పేదల కోసమే కేటాయించి అక్కడే ఇళ్లు కట్టించి వారి పేరు మీద రిజిస్ట్రేషన్ పట్టాలు ఇస్తామని ప్రకటించారు.

గోషామహల్ పరిధిలోని ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా, పాడుపడిపోయి ఉన్న 125 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి చేసిందని పొంగులేటి చెప్పారు. ఈ రోజు ఆ ఇళ్లను లబ్ధిదారులకు సగర్వంగా అప్పగించామన్నారు. అయితే ఈ నియోజకవర్గంలో ఇంకా ఎంతో మంది నిరుపేదలు ఇళ్లు లేక అద్దె ఇళ్లలో మగ్గుతున్నారని.. వారందరికీ కూడా రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకోసం ధూల్‌పేట పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను తక్షణమే అన్వేషించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వేదికపై నుంచే మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

గత పాలకులు అనుసరించిన తప్పుడు విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చివేసిందని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా వివరించారు. "గతంలో పేదలకు ఇళ్లు ఇస్తున్నామనే పేరుతో వారిని హైదరాబాద్ నగరానికి 30 నుండి 40 కిలోమీటర్ల దూరంలో ఎక్కడో అడవుల్లో, శివార్లలో ఉన్న ప్రాంతాలకు తరలించేవారు. దీనివల్ల వారి రోజువారీ జీవనోపాధి, కూలీ పనులు దెబ్బతినేవి. కానీ మా ప్రభుత్వంలో అలాంటి పద్ధతి ఉండదు. నగరంలో నివసించే పేదలకు వారి జీవనాధారాలు, వ్యాపారాలు ఎక్కడైతే ఉన్నాయో.. దానికి అత్యంత దగ్గరగా, అదే నియోజకవర్గ పరిధిలోనే ఇళ్లు కట్టించి ఇవ్వడం మా ప్రభుత్వ కట్టుబాటు" అని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సాధించిన ప్రగతి కంటే.. కేవలం రెండున్నరేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ఇళ్లను నిర్మించి చూపిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. "ఒకవేళ నేను చెప్పినట్లుగా పదేళ్ల బీఆర్ఎస్ మార్కు కంటే ఎక్కువ ఇళ్లను రెండున్నరేళ్లలో పేదలకు ఇవ్వలేకపోతే.. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నేను అసలు పోటీనే చేయను. ఈ ఓపెన్ ఛాలెంజ్‌ను నేను ఎప్పుడో విసిరాను. కానీ దురదృష్టవశాత్తూ ఇప్పటివరకు ఏ ఒక్క బీఆర్ఎస్ నేత కూడా నా సవాల్‌ను స్వీకరించేందుకు ముందుకు రాలేదు" అని ఎద్దేవా చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టిస్తే తమకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఉండదనే స్వార్థ ఆలోచనతోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిగా పక్కనబెట్టేసిందని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు.కేవలం కమీషన్లు, అవినీతికి ఆస్కారం ఉండే భారీ నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తప్పుడు పోకడలకు స్వస్తి చెప్పిందని.. ప్రజల సొమ్మును తిరిగి ప్రజల సంక్షేమం కోసమే, ముఖ్యంగా పేదల సొంత గూడు నిర్మాణం కోసమే ఖర్చు పెడుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా త్వరలోనే 'గుడిసెల్లేని తెలంగాణ' అనే మహోన్నత లక్ష్యాన్ని నిజం చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు.

# వీబీ జీరామ్‌జీ అమలుకు క్యాబినెట్ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

సృష్టికి కూడా ఆమోదం తెలిపింది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆస్పత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మొత్తం 6,278 పోస్టుల భర్తీకి క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆస్పత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించింది.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీంతో సుమారు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, సిబ్బందికి ఈ పథకం వర్తించనుంది. పథకం అమలులో నాణ్యత, జవాబుదారీతనం మరింత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

అదేవిధంగా వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వ భూములను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు కేటాయించాలని నిర్ణయించింది. మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు, జగిత్యాల జిల్లాలో కేంద్రీయ విద్యాలయం స్థాపనకు అవసరమైన ప్రభుత్వ భూముల కేటాయింపుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మూసీ అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, విద్యా రంగ బలోపేతం, ఉపాధి హామీ పథకం అమలు వంటి అంశాలకు ఈ సమావేశంలో ప్రత్యేక ప్రాధాన్యం లభించింది.

## జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా శాంతి కోటేష్ గౌడ్

**జవహర్ నగర్, జులై 2,(ప్రజాస్వరం):**

జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలుగా దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా బాధ్యతలు నిర్వహించిన శాంతి కోటేష్ గౌడ్ ను జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించడంతో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రష్ యాదవ్ కు పార్టీ కృతజ్ఞతలు తెలియజేశారు.



## బాలాజీ నగర్ లో వ్యక్తి అదృశ్యం

**జవహర్ నగర్, జూలై 2, (ప్రజాస్వరం):**



వ్యక్తి అదృష్టమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ లో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ నగర్ , మార్వాడి లైనుకు చెందిన రావికంటి ఈశ్వర్ (44) జూన్ 30వ తేదీన సాయంత్రం ఇంట్లో నుండి తన స్కూటీపై ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని మొబైల్ ఫోన్ ఇంట్లోనే వదిలి వెళ్లిపోయాడు. ఈశ్వర్ తనకు తెలిసిన వారి దగ్గర అప్పులు చేయడం వల్ల ఇంట్లో నుంచి వెళ్ళిపోయినాడని ఈశ్వర్ భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న జవహర్ నగర్ పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం....

**మెదక్, జూలై 2 (ప్రజా స్వరం)**

మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ డిప్లొమా కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ల కు అర్హులైన విద్యార్థిను ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భవాని తెలిపారు. మరిన్ని వివరాల కోసం tgpolycet.nic.in వెబ్ సైట్ ను లేదా మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ భవాని తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, సెమీకండక్టర్ టెక్నాలజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల సమర్పణకు జూలై 3, 2026 చివరి తేదీగా నిర్ణయించారు. జూలై 4, 2026 ఉదయం 9 గంటలకు కళాశాల ప్రాంగణంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు కూడా సీట్లు మిగిలి ఉంటే, వాటిని జూలై 08 న భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, నిర్ణీత అడ్మిషన్ ఫీజు తో కలిసి జూలై 4 ఉదయం 9 గంటల లోపు కళాశాలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం tgpolycet.nic.in వెబ్ సైట్ ను సందర్శించవచ్చని లేదా మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ భవాని తెలిపారు.




# పోలీస్ శాఖలో ఏసీబీ భారీ స్కెచ్

**మొదటిపేజీ తరువాయి**

కూడబెట్టారంటూ ఏసీబీ ప్రధాన కార్యాలయానికి గత కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు రహస్యంగా నిఘా ఉంచి, ఆయన సంపాదన మరియు లగ్జరీ జీవితంపై నమ్మదగిన సమాచారాన్ని సేకరించారు. ప్రాథమిక ఆధారాలు లభించడంతో పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ప్రత్యేక ఏసీబీ బృందాలు, ఏకకాలంలో దాడులు చేసి ఆయన అక్రమ సామ్రాజ్యం గుట్టురట్టు చేసే పనిలో పడ్డాయి.

హైదరాబాద్ నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తారామతి బారామతి పరిసరాల్లో భీమ్ రెడ్డికి ఒక అత్యంత విలాసవంతమైన లగ్జరీ విల్లా ఉంది. గురువారం ఉదయం నుంచే ప్రత్యేక బృందాలు ఈ విల్లాను తమ ఆధీనంలోకి తీసుకుని అంగుళం అంగుళం వెతకడం ప్రారంభించాయి. కేవలం ఆయన ఇల్లే కాకుండా, ఆయనకు అత్యంత ఆప్తులుగా ఉన్న సన్నిహితులు, బంధువుల ఇళ్లను కూడా వదిలిపెట్టలేదు. హైదరాబాద్ మరియు దాని చుట్టుపక్కల జిల్లాల పరిధిలోని సుమారు పది ప్రాంతాలలో ఈ సోదాల పర్వం ఏకకాలంలో కొనసాగుతోంది.

ఇప్పటివరకు జరిగిన సోదాల్లో డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసం నుండి కళ్లు చెదిరే స్థాయిలో అక్రమ సంపద బయటపడినట్లు తెలుస్తోంది. ఆయన ఇంట్లో పెద్ద ఎత్తున బంగారు నగలు, వజ్రాభరణాలు, వెండి వస్తువులను అధికారులు గుర్తించారు. వీటన్నింటికంటే ముఖ్యంగా పాత కాలపు నవాబుల తరహాలో భారీ పరిమాణంలో ఉన్న వెండి బిందెలను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ఈ ఆభరణాల బరువును, వాటి ప్రస్తుత మార్కెట్ విలువను లెక్కించేందుకు ప్రత్యేకంగా బరువులు తూచే వారిని పిలిపించారు.

అక్రమ ఆస్తులు, నగలతో పాటు భీమ్ రెడ్డి నివాసంలో ఎవరూ ఊహించని మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సాధారణ నిబంధనల ప్రకారం ఇంట్లో ఉంచుకోవాల్సిన పరిమితికి మించి, భారీ మొత్తంలో విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు కనుగొన్నారు. అత్యంత ఖరీదైన బ్రాండ్లకు సంబంధించిన ఈ మద్యం బాటిళ్లను నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచడంతో, వాటిని కూడా ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

భీమ్ రెడ్డి ఇంట్లో జరిపిన అన్వేషణలో లగ్జరీ విల్లాకు సంబంధించిన పత్రాలతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు విలువైన ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన ఒరిజినల్ ల్యాండ్ డాక్యుమెంట్లను ఏసీబీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇవన్నీ ఆయన పేరు మీద, అలాగే బినామీల పేర్ల మీద కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ భూముల రిజిస్ట్రేషన్ విలువకు, ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ ఏసీబీ సోదాలు ఇంకా నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇళ్లు, కార్యాలయాల్లోని లాకర్లు, అల్మారాలను అధికారులు పూర్తిగా తెరిచి చూస్తున్నారు. సోదాలు పూర్తిగా ముగిసేసరికి భీమ్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల నికర విలువ మరిన్ని కోట్ల రూపాయలలో తేలే అవకాశం ఉందని ఏసీబీ ఉన్నతాధికార వర్గాలు వెల్లడించాయి. బ్యాంక్ ఖాతాలు, నిలవ ఉన్న నగదు వివరాలను కూడా సేకరిస్తున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కంప్యూటర్స్ వంటి సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న ఒక డీఎస్పీ స్థాయి అధికారి ఇళ్లపై ఏసీబీ దాడులు జరగడం పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. తోటి ఉద్యోగులు, ఉన్నతాధికారులు ఈ దాడి వార్త విని విస్మయానికి గురవుతున్నారు. చట్టాన్ని రక్షించాల్సిన విభాగంలో ఉంటూ ఇంతటి అక్రమాలకు పాల్పడటంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. త్వరలోనే ఏసీబీ అధికారులు ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన విడుదల చేయనున్నారు.



## ఘనంగా పవర్ ఫిట్నెస్ జిమ్ ప్రారంభోత్సవం

**(ప్రజాస్వరం)మేడ్చల్:**

మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ లో పవర్ ఫిట్నెస్ జిమ్ ను ఘనంగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా కౌన్సిలర్లు శ్రీలత రమేష్ యాదవ్, వాచ్ పల్లి అర్చన శ్రీనివాస్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్,మాజీ సర్పంచ్ మేకల వెన్నెల రామకృష్ణుడు, మాజీ ఎంపిటిసి కుమార్ యాదవ్ లు హాజరయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యాయామం పట్ల శ్రద్ధ పెట్టడం వలన శరీరం దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కూడా పొందుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు గౌడ్,ప్రవీణ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.







## ఘనంగా నల్ల పోచమ్మ తల్లి ఊరేగింపు

**(ప్రజాస్వరం)మేడ్చల్ :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిష్టాపూర్ పూడూరు డివిజన్ లోని కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా గురువారం నల్ల పోచమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. నేటి నుంచి మూడు రోజులపాటు అమ్మవారి ప్రతిష్టాపన కార్యక్రమం ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మశ్రీ సంజయ్ శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణోత్తములు వేద మంత్రోచ్చారణలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు కాలనీవాసులు స్థానిక నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## గుండ్లపోచంపల్లి లో కాంగ్రెస్ కు షాక్,మూకుమ్మడి రాజీనామా.

**(ప్రజాస్వరం)మేడ్చల్:**

గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి బండారి నరేందర్ ముదిరాజ్ ను నియమించకుండా,గరిశెల సురేందర్ ను నియమించడంతో గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మూకుమ్మడి రాజీనామా చేశారు.పార్టీని మోసం చేసి,కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి,కౌన్సిలర్ల ఓటమికి కారణమయిన వ్యక్తి కి అధ్యక్ష పదవి ఇవ్వడం కరెక్ట్ కాదన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన గుర్తింపు లేక ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

## జర్నలిస్టులను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్....

- **సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ...**

**మెదక్ జూలై 02 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ గురువారం జర్నలిస్టులను కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులతో పలు అంశాలపై చర్చించిన ఆయన, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని దొంతి నరేష్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బచ్చు సంగమేశ్వర్, రాజశేఖర్, మువ్వ నవీన్,అశోక్, నీలం, బండ నరేష్, రహ్మద్, సందీప్, శ్రీహరి గౌడ్, ఉషయ్య, కార్తీక్, సుభాష్, జనార్ధన్, అల్లాడి శేఖర్, రాఘవులు, సంగమేశ్వర్, శేఖర్ గౌడ్, సిద్ధు, అంజా గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## కన్నాయిగూడెం కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా జాడి రాంబాబు

**కన్నాయిగూడె, జులై 2 (ప్రజా స్వరం ) :**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జాడి రాంబాబును పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాడి రాంబాబు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కార్యకర్తలతో కలిసి సమిష్టిగా పనిచేస్తానని పేర్కొన్నారు.



# జిల్లా చరిత్రలో రికార్డు స్థాయి ధాన్యం కొనుగోలు.....

- **జిల్లాలో జొన్నలు కొనుగోలు చేస్తాం...**
- **ధాన్యం కొనుగోళ్లలో మీడియా పాత్ర అమోఘం...**
- **జిల్లాలో సంపూర్ణంగా ధాన్యం కొనుగోళ్లు.....**
- **జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ.....**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్......**

**మెదక్ జూలై 02 (ప్రజా స్వరం)**

జిల్లాలో సంపూర్ణంగా వరి ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు విజయవంతం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా చరిత్రలో జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సంపూర్ణంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు.

ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే 1.08 lakhs మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు పండించారని,జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి అయిందన్నారు. రైతుల అకౌంట్లలో రూ.1005.66 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు.1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసి ఏప్రిల్ 08 న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 27వ తేదికి పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ 305, ఐకేపీ 185, డీసీఎంఎస్ 43 కేంద్రాల్లో కొనుగోలు జరిపామన్నారు.

**జొన్నలు కొనుగోలు చేస్తాం**

జిల్లాలో జొన్న రైతులు ఎలాంటి ఆందోళన గురికావద్దని, జొన్నల కొనుగోళ్ల గురించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. శుభ్రంగా ఉన్న జొన్నల్ని కొరడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 3609 ముందు రైతుల నుండి 6347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా సివిల్ సప్లై అధికారి



నిత్యానందం, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, పాత్రికేయులు పాల్గొన్నారు.








# నమ్మకం.. నట్టేట ముంచింది...





- **సుమారు రూ.30 కోట్ల పైగా టోకరా ?**
- **భద్రాద్రిలో కోట్ల రూపాయల టోకరా పెట్టిన కాంట్రాక్టర్**
- **భద్రాద్రిలో కలకలం రేపుతున్న కాంట్రాక్టర్ మాయాజాలం**
- **ఇళ్లకు తాళాలు.. ఫోన్లు స్విచ్ఆఫ్.. పరారీలో మోసగాడు**
- **రాతపూర్వక ఆధారాల్లేక లబోదిబోమంటున్న బాధితులు**
- **జిల్లాలో పెరుగుతున్న అనధికారిక ఆర్థిక లావాదేవీల ఉచ్చు**
- **వరుస మోసాలతో నలిగిపోతున్న అమాయకపు ప్రజలు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 02,( ప్రజా స్వరం )**

"నమ్మకమే మాకు ఉరితాడు అయ్యింది.. జీవితాంతం కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము, ఆశ చూపి అప్పు తెచ్చిన నగదు.. మొత్తం ఆ కాంట్రాక్టర్ చేతిలో పెట్టి ఇప్పుడు వీధిన పడ్డాం." ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రస్తుతం బాధితుల గుండెల్లోంచి వినిపిస్తున్న ఆవేదన. కాంట్రాక్టుల పేరుతో, అధిక లాభాల ఆశ చూపి సుమారు రూ.30 కోట్ల మేర వసూలు చేసి, అర్ధరాత్రికి అర్ధరాత్రి ఇళ్లకు తాళాలు వేసి పరారైన కాంట్రాక్టర్ వ్యవహారం జిల్లాను ఉలిక్కిపడేలా చేస్తోంది.

**వల వేసింది ఎలాగంటే..**

జిల్లాలో నిర్మాణ రంగం, కాంట్రాక్టులపై పట్టున్న సదరు కాంట్రాక్టర్, తనకున్న పరిచయాలను వాడుకుని తనదైన శైలిలో వల విసిరాడు. "పెద్ద పెద్ద ప్రభుత్వ కాంట్రాక్టులు చేస్తున్నా, పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయి" అంటూ మొదట నమ్మకం కలిగించాడు. పదుల సంఖ్యలో ఉన్న బాధితులను నమ్మించేందుకు, మొదటి కొన్ని నెలలు లాభాలను చెల్లించి గాలం వేశాడు. ఆ నమ్మకంతోనే బాధితులు తమ ఆస్తులను తాకట్టు పెట్టి మరీ అతనికి అప్పుగా నగదు ఇచ్చారు. తీరా, చేతికి రూ.30 కోట్ల పైచిలుకు నగదు అందగానే, ఒక్కసారిగా సీన్ రివర్స్ చేశాడు.

**--పరారీలో 'వ్యాపార' కిలాడీ**

గత కొద్ది రోజులుగా సదరు కాంట్రాక్టర్ ఫోన్ స్విచ్ఆఫ్ రావడం, ఇంటికి తాళాలు వేసి ఉండటంతో బాధితులు అవాక్కయ్యారు. వెతికినా ఫలితం లేకపోవడంతో, తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో, ఒక్కొక్కరుగా బాధితులు బయటకు వస్తున్నారు.

**ఆధారాల్లేక.. పోలీసులు ఏమంటారోనని..**

ఈ లావాదేవీలన్నీ కేవలం నమ్మకం మీద, నోటి మాటతోనే జరగడం బాధితుల పాలిట శాపంగా మారింది. రాతపూర్వక ఒప్పందాలు లేకపోవడంతో, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు జంకుతున్నారు. "ఒకవేళ కేసు పెడితే, అతడు పోలీసుల చేతికి చిక్కినా మా డబ్బులు తిరిగి వస్తాయా? లేక పరువు పోతుందా?" అన్న సందిగ్ధంలో బాధితులు మౌనంగానే బాధను దిగమింగుతున్నారు. జిల్లాలో ఇలాంటి అనధికారిక ఆర్థిక లావాదేవీలు ఒక మహమ్మారిలా మారుతున్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**--అప్రమత్తతే ఏకైక మార్గం**

"అధిక లాభాల ఆశ చూపే వ్యక్తుల పట్ల ఎంతటి సన్నిహితులైనా సరే.. అప్రమత్తంగా ఉండాలి. రాతపూర్వక ఒప్పందాలు, బ్యాంక్ లావాదేవీలు లేని చోట ఆర్థిక వ్యవహారాలు జరపడం అంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే" అని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

**ప్రభుత్వం, పోలీసుల స్పందన ఆశిస్తూ..**

ప్రస్తుతం ఈ వ్యవహారం భద్రాద్రి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి మోసగాళ్లను ఉపేక్షిస్తే, మరిన్ని కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి, బాధితుల గోడు విని, పరారీలో ఉన్న కాంట్రాక్టర్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999